క్లుప్తంగా

జామాయిల్ కర్ర స్వాధీనం

గుడ్లూరు: అటవీ శాఖ భూమిలో నుంచి ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను అటవీశాఖ అధికారులు మండలంలోని మోచర్ల వద్ద గురువారం స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. గత కొంత కాలంగా మోచర్ల అటవీ బీట్ పరిధిలో ఉన్న ఫారెస్ట్ రిజర్వు భూముల్లో సాగులో ఉన్న జామాయిల్ కర్రను కొంత మంది అక్రమార్కులు అక్రమంగా కొట్టుకొని ట్రాక్టర్లు ద్వారా తరలించి అమ్ముకుంటున్నారు. గురువారం రిజర్వు ఫారెస్టు భూమిలో నుంచి జామాయిల్ కర్రను అక్రమంగా ట్రాక్టరులో తరలిస్తున్నారని సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు దాడులు చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

8 మద్యం సీసాలు స్వాధీనం

గుడ్లూరు: బంకులో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం సీసాలను పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక ఎస్సీ కాలనీలో నాగేశ్వరరావు అనే వ్యక్తి తిను బండారాల బంకు నిర్వహిస్తున్నాడు. ఆ బంకులో మద్యం సీసాలను నిల్వ ఉంచి అక్రమంగా అమ్ముతున్నాడని సమాచారం అందుకున్న ఎస్సై లక్ష్మణరావు తన సిబ్బందితో బంకుపై దాడి చేసి అందులో అక్రమంగా నిల్వ ఉంచిన 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని నాగేశ్వరరావును అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కందుకూరు: కందుకూరు పట్టణంలోకి కస్తూర్బా గాంధీ జూనియర్ కాలేజీలో 2024–25 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ గ్రూపు ప్రవేశపెట్టినట్లు ప్రిన్సిపాల్ స్వాతి తెలిపారు. విద్యార్థినులు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9666092091 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కందుకూరు: పట్టణంలోని స్వర్ణ స్వయం కృషి మానసిక వికలాంగుల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సర ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి గురువారం తెలిపారు. 6 నుంచి 23 ఏళ్ల లోపు వయసు కలిగిన తెలివితేటలు లేని పిల్లలు, పుట్టుక నుంచి మాటలు రాని వారు, సొంతంగా పనులు చేసుకోలేని చిన్నారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి విద్యాభ్యాసంతో పాటు మాటలు నేర్పిస్తామని వివరించారు. పెద్ద పిల్లలకు వృత్తి విద్యా శిక్షణలో భాగంగా స్పైరల్ బైండింగ్ నేర్పిస్తామని తెలిపారు. అలాగే బధిరుల పాఠశాల పిల్లలకు 1 నుంచి 9వ తరగతి వరకు విద్యనందిస్తామని పేర్కొన్నారు. ఈ ఏడాది 15 మంది విద్యార్థులకు హాస్టల్ వసతి కోసం అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. కందుకూరు పరిసర ప్రాంత గ్రామాల నుంచి వచ్చే పిల్లలకు ఈ ఏడాది నుంచి వ్యాన్ సౌకర్యాన్ని కూడా కల్పిస్తున్నట్లు వివరించారు. ఈనెల 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 9492119828 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పచ్చిరొట్ట పైర్లతో ప్రయోజనం


టంగుటూరులో వేలంలో పాల్గొన్న వ్యాపారులు

టంగుటూరు: పొగాకు రైతులు పచ్చిరొట్ట పైర్లు సాగు చేస్తే భూములు సారవంతంగా మారి అధిక దిగుబడి పొందవచ్చని రైతులకు వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు గురువారం సలహాలు, సూచనలిచ్చారు. స్థానిక వేలం కేంద్రానికి ఎం.నిడమానూరు గ్రామానికి చెందిన రైతులు 1166 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 1106 కొనుగోలయ్యాయి. 60 పొగాకు బేళ్లు తిరస్కరించారు. గరిష్ట ధర రూ.330, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.278.89 పలికింది. వేలంలో మొత్తం 44 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

అన్య పదార్థాలు లేకుండా చూసుకోవాలి

కొండపి(సింగరాయకొండ): పొగాకు గ్రేడింగ్ సమయంలో అన్య పదార్థాలు లేకుండా చూసుకోవాలని, అలాంటి బేళ్లకు అధిక ధర పొందవచ్చని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం నిర్వహించిన వేలంలో కామేపల్లి, పచ్చవ గ్రామాలకు చెందిన రైతులు 1074 బేళ్లు ఉంచగా 1013 కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 61 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.330, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.279.69 పలికింది. వేలంలో 24 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

15న మండల సర్వసభ్య సమావేశం

వెలిగండ్ల: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 15న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీపీ రామన మహాలక్ష్మి తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మండల కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని ఎంపీపీ కోరారు.

పాఠశాలలకు విద్యార్థి కిట్ల పంపిణీ


విద్యార్థి కిట్‌లను అందజేస్తున్న ఎంఈఓలు ప్రసాదరావు, కొండారెడ్డి

సీఎస్‌పురం(పామూరు): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందించేందుకు విద్యార్థి కిట్లు పంపిణీని గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖాధికారులు జె.ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి పాఠశాలల హెచ్ఎంలకు కిట్లు అందజేసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల పునః ప్రారంభం నాడే ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10 తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్నామన్నారు. బ్యాగులు, బెల్టులు మండల కేంద్రానికి వచ్చాయని యూనిఫాం, బూట్లు రాగానే పూర్తిస్థాయి విద్యార్థి కిట్లు విద్యార్థులకు అందిస్తామని ఎంఈఓలు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా వసతులు ఉన్నాయని, విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలని సూచించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, సీఆర్‌పీలు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

గుడ్లూరు: మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలి రోజే విద్యార్థులందరికీ విద్యార్థుల కిట్స్ కింద పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసినట్లు ఎంఈఓ–2 గోవర్ధన్ తెలిపారు. 48 ప్రాథమిక, 7 ప్రాథమికోన్నత, 4 ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ మొత్తం 60 పాఠశాలల్లో చదువుతున్న 2900 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బూట్లు, నోట్‌పుస్తకాలు అందించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 75 శాతం పుస్తకాలు వచ్చాయని, వాటిని అన్ని పాఠశాలలకు పంపిణీ చేశామన్నారు. మిగిలిన 25 శాతం పుస్తకాలు త్వరలో వస్తాయన్నారు. విద్యార్థులకు తొలి రోజు నుంచే పాఠ్యపుస్తకాల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

కొండపి(సింగరాయకొండ): వేసవి సెలవుల్లో ఆటాపాటలతో సరదాగా గడిపిన విద్యార్థులు గురువారం నుంచి బడి బాట పట్టారు. మూలకు పడేసిన పుస్తకాల బ్యాగులను, టిఫిన్ బాక్స్‌ల దుమ్ము దులిపి బడిబాట పట్టారు. బడులు తెరిచిన మొదటి రోజునే పాఠ్య పుస్తకాలు, స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు సౌకర్యాలు ఉండేవి కాదని అపవాదు ఉండేది. గత ప్రభుత్వ చర్యలతో నేడు సర్కారీ స్కూళ్ల రూపురేఖలు మారిపోయాయి. మండలంలో ఎక్కడకి వెళ్లినా సరికొత్తగా ప్రభుత్వ పాఠశాలలు దర్శనమిస్తున్నాయి. పేద విద్యార్థుల చదువులకు ఇబ్బందులు తలెత్తకుండా గత ప్రభుత్వం జగనన్న విద్యా కానుక పేరుతో పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, సాక్సులు, బెల్ట్స్, బ్యాగులు, డిక్షనరీలు ఇచ్చింది. ప్రభుత్వం మారడంతో ఈ పథకం పేరును స్టూడెంట్ కిట్లుగా మార్పు చేశారు. కొండపి మండలంలో ప్రభుత్వ పాఠశాలలో మొత్తం 3,014 మంది విద్యార్థులు ఉన్నారని ఎంఈఓ–2 రామారావు తెలిపారు.

వర్ధంతికి హాజరైన ఎమ్మెల్యే తాటిపర్తి


కొండమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ మండల పార్టీ ఉపాధ్యక్షుడు సవళం కోటేశ్వరరావు తల్లి కొండమ్మ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో గురువారం యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండమ్మ చిత్రపటానికి తాటిపర్తి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పార్టీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, షేక్ లియాఖత్, షేక్ పటేల్, షేక్ సుల్తాన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నందనవనం సొసైటీ అధ్యక్షుడు రాజీనామా


మదనమోహన్‌రావు

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలం నందనవనం సహకార సొసైటీ అధ్యక్ష పదవికి వైఎస్సార్ సీపీ నాయకుడు కొమ్మాల పాటి మదనమోహన్ రావు రాజీనామా చేశారు. తాను వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. రాజీనామా లేఖను సహకార శాఖ జిల్లా అధికారికి పంపించినట్లు చెప్పారు. తన హయాంలో సొసైటీని ఆర్థికంగా బలోపేతం చేసినట్లు పేర్కొన్నారు.

పరిష్కార వేదికకు 17 అర్జీలు


ఉలవపాడులో అర్జీలు స్వీకరిస్తున్న తహశీల్దార్, ఎంపీడీఓ

ఉలవపాడు: సబ్‌కలెక్టర్ ఆదేశాల మేరకు ఉలవపాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమస్యల పరిష్కార వేదికకు 17 అర్జీలు వచ్చాయి. మండల స్థాయిలో సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన కార్యక్రమంలో తహశీల్దార్ చంద్రారెడ్డి, ఎంపీడీఓ విజయకుమారి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూకు సంబంధించి 13 అర్జీలు, మిగిలిన శాఖలకు చెందిన 4 అర్జీలు వచ్చాయి. వీటిని త్వరితగతిన పరిష్కరించనున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు పోరాటం తప్పనిసరి

ఒంగోలు: బాధ్యతలకు నిలబడి హక్కులు సాధించుకునేందుకు పోరాటా పంథా తప్పనిసరి అని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ కీర్తి, ఐఫియా కౌన్సిలర్ పీవీ సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు . ప్రభుత్వ పాఠశాలలను, ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకునేందుకు జీవో నెంబర్ 117 ఉత్తర్వులను రద్దు చేయాలని, పాఠశాలల విలీనాన్ని రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో రెండు మాధ్యమాలను కొనసాగించాలని, 2005కు ముందు మాదిరిగా ప్రతి తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. సీపీఎస్ రద్దు చేయాలని, 12వ పీఆర్‌సీకి ముందే ఐఆర్ ప్రకటించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు బకాయిలున్న రూ. 25వేల కోట్లు విడుదల చేయాలని తెలిపారు. తల్లికి వందనం డబ్బులు కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే ఇవ్వాలన్నారు.

ఫిజియోథెరపీ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి


భవితా కేంద్రంలో ఫిజియోథెరపీ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ

కనిగిరి రూరల్: ప్రత్యేక అవసరాలు కల్గిన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓలు డీవీ సుబ్బారావు, యువీ నారాయణరెడ్డి కోరారు. పాఠశాలల పునః ప్రారంభం పురస్కరించుకుని గురువారం స్థానిక భవిత కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ క్యాంప్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రత్యేక అవసరాలు కల్గిన విద్యార్థులంతా క్యాంపులకు రావాలన్నారు. వైద్య శిబిరంలో వైద్యులు పుల్లయ్య వైద్య సేవలు అందిస్తారని చెప్పారు. ఐఈఆర్‌సీ టీచర్లు సైమన్, గోపాలకృష్ణ, కేర్ గీవర్ వలంటీర్ హబీబా తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సృజన


ర్యాలీలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సృజన

కనిగిరి రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కె. సృజన అన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర సృజన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. దోమకాటుతో మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, బోధకాలు, మెదడు వాపు వ్యాధులు ప్రబలుతాయని జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. దోమ తెరలు వాడడాలని, స్ప్రేలు, మస్కిటోకాయలు వాడటం వల్ల దోమల బారిన పడకుండా ఉండవచ్చని తెలిపారు. కిటికీలకు, తలుపులకు నెట్‌లు బిగించుకోవాలని సూచించారు. చలి, జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి, నీరసంగా ఉండటం వంటి లక్షణాలు కన్పిస్తే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి రామాంజనేయులు, టీబీ యూనిట్ అధికారి బాబురావు, ఉమా మహేశ్వరరావు, వివిధ సంస్థల ప్రతినిధులు మంద్రు రమేష్ బాబు, నవకుమార్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి చేయాలి


పామూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

పామూరు: మలేరియా నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని, అందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని హెచ్ఈఓ పెరుగు శ్రీధర్ పేర్కొన్నారు. మండలంలోని బొట్లగూడూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో పామూరులో గురువారం మలేరియా నిర్మూలన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, మెదడువాపు, బోదకాలు మొదలైనవి దోమకాటు ద్వారా వస్తాయన్నారు. మలేరియా వ్యాప్తి చెందే విధానం, నిర్మూలనకు అవలంబించాల్సిన పద్ధతులు వివరించారు. ముఖ్యంగా నివాస గృహాలకు సమీపంలో మురుగు నీరు నిల్వలు లేకుండా చేసి దోమల నివారణకు కృషి చేయాలన్నారు. అదేవిధంగా వృథాగా ఉన్న తొట్లలో, ప్లాస్టిక్ కవర్లలో, ఖాళీ కొబ్బరి బొండాలలో నీటి నిల్వలు లేకుండా చూడటం ద్వారా దోమలను అరికట్టి తద్వారా మలేరియాను నిర్మూలించవచ్చన్నారు. సూపర్‌వైజర్ ఏ.నిర్మల, ఎంఎల్‌హెచ్‌పీలు సురేష్, సుబ్బరాయుడు, అనూష, దివ్య, మౌనికా రెడ్డి, సునీత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు


రోడ్డు మరమ్మతులను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి జగదీష్

టంగుటూరు: రైల్వే మూడో లైను పనుల కారణంగా 45 రోజులపాటు రాకపోకలు నిలిపేసిన సంగతి తెలిసిందే. అయితే చాకిరేవు కుంట రోడ్డుకు మరమ్మతులు నిర్వహిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి నర్రా జగదీష్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ పరిధిలో ఉన్న రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి మూతపడటంతో చాకిరేవు కుంట మీదుగా పాటి మీద రైల్వే గేట్ రోడ్డుకు ప్రజల సౌకర్యార్థం మరమ్మతులు చేయించి, వీధి లైట్లు వేయించామన్నారు. సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

24న నారాయణస్వామి ఆలయ హుండీ లెక్కింపు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఈనెల 24వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు హుండీ లెక్కింపు చేపడుతున్నట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమం దేవాదాయ ధర్మాదాయ అధికారుల సమక్షంలో జరుగుతుందని, భక్తులు పాల్గొనాలని చైర్మన్, ఈఓలు కోరారు.



సుబ్బారెడ్డిని అభినందిస్తున్న సబ్‌కలెక్టర్ విద్యాధరి

ఉత్తమ పనితీరు అధికారులకు అభినందన

కందుకూరు: సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తమ ప్రతిభ చూపిన పలువురు అధికారులు, సిబ్బందిని స్థానిక కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ విద్యాధరి అభినందించారు. నామినేషన్ల స్వీకరణ దగ్గర నుంచి ఎన్నికల నిర్వహణ, కౌంటింగ్ ప్రక్రియ వరకు నియోజకవర్గంలో ప్రశాంతంగా జరిగాయని చెప్పారు. ఎన్నికల విధుల్లో నియమితులైన అధికారులు, సిబ్బంది సహకారం వల్లే ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడం సాధ్యమైందన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేశారు. దీనిలో భాగంగా కందుకూరు మండల సెక్టోరల్ అధికారిగా విధులు నిర్వర్తించిన మండల విద్యాశాఖ అధికారి సుబ్బారెడ్డిని ఆమె ప్రశంసించారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారని, పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగడంలో ఇటువంటి ఎందరో అధికారులు సహకారం అందించారని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు ఎంఈఓ సుబ్బారెడ్డి అభినందనలు తెలిపారు.

స్కూల్‌వ్యాన్ బహూకరణ


స్కూల్‌వ్యాన్‌ను బహూకరిస్తున్న ఎల్ఐసీ అధికారులు

కందుకూరు; పట్టణంలోని కోవూరు రోడ్డులో ఉన్న స్వర్ణస్వయం కృషి మానసిక దివ్యాంగుల పాఠశాల పిల్లల సౌకర్యార్థం ఎల్ఐసీ తరఫున స్కూల్‌వ్యాన్‌ను బహూకరించారు. ఎల్ఐసీ గోల్డెన్ జూబ్లీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ 18,20,710 విలువైన వ్యాన్‌ను పాఠశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డికి ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్‌బి ప్రసాదరావు, మార్కెటింగ్ మేనేజర్ జి.కృష్ణమూర్తి, కందుకూరు బ్రాంచ్ సీనియర్ మేనేజర్ ఐవీఏ కాంతారావుల చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ మానసిక వికలాంగుల పిల్లల కోసం స్కూల్ వ్యాన్ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో ఎల్ఐసీ తరుపున మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కరస్పాండెంట్ సుబ్బారెడ్డి ఎల్ఐసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి నాయబ్‌రసూల్

సీఎస్‌పురం(పామూరు): విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేదిశగా ప్రభుత్వం దృష్టి సారించాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్.నాయబ్‌రసూల్ అన్నారు. సీఎస్‌పురం ప్రధాన పాఠశాలలో గురువారం ఏపీటీఎఫ్ సమావేశం ఏపీటీఎఫ్ సీఎస్‌పురం మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు తోట శ్రీనివాసులు, జె.ఎస్.ఆనంద్‌బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నాయబ్‌రసూల్ మాట్లాడుతూ పాఠశాలల్లో తెలుగు మీడియం కొనసాగించాలని, ప్రతి హైస్కూల్‌కు హెచ్‌ఎం పోస్టు ఉండాలని, తల్లికి వందనం కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే వర్తింపచేయాలని, 117 జీఓను వెంటనే రద్దుచేయాలని కోరారు. ఏపీటీఎఫ్ మండలశాఖ నాయకులు డి.సుబ్బరాయుడు, పి.మాలకొండయ్య, కె.రామసుబ్బారావు, బి.రవీంద్ర, చెన్నయ్య, జి.రామకష్ణ, బి.శ్రీనివాసులు, రఫీ, జి.పుల్లయ్య, బి..చిన్ననారాయణ, సీహెచ్.సునీతాదేవి, గాంధీ, ఇండ్లా ప్రసాద్, వై.శ్రీహరి, అహ్మద్, రవీంద్ర, జి.మల్లికార్జునరాజు పాల్గొన్నారు.